

గంజాయి జంక్షన్

జిల్లా మీదుగా రవాణా

- భద్రాద్రి కొత్తగూడెం అటవీ మార్గంలో ప్రయాణం
- జిల్లాలోని రైల్వేస్టేషన్లు ఉన్న ప్రాంతాలకు తరలింపు
- అక్కడి నుంచి మహారాష్ట్ర, హైదరాబాద్.. ఇతర పట్టణాలకు సరఫరా



మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దుల్లో నిఘా పెట్టి శాంతిభద్రతలను కాపాడడంలో విజయవంతమైన జిల్లా పోలీసులు గంజాయి మరకను మాత్రం చెరపలేక పోతున్నారు. ఒకప్పుడు గంజాయి సాగుకు అడ్డాగా ఉన్న మానుకోట ప్రస్తుతం సరఫరాకు కేంద్ర బిందువుగా మారింది. హైదరాబాద్, మహారాష్ట్ర, ముంబయి లాంటి మహా నగరాలకు రవాణా చేస్తున్నారు. ఇటీవల వరుసగా గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన ఘటనలే ఇందుకు నిదర్శనం.

సరిహద్దు రాష్ట్రాల నుంచి..

తెలంగాణ సరిహద్దుల్లోని ఒడిశా, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మానుకోటకు, ఇక్కడి నుంచి హైదరాబాద్, మహారాష్ట్ర, ముంబయి ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు, నీలేరుతో పాటు చర్ల సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నట్లు ఇటీవల పోలీసులకు పట్టుబడిన యువకుల ద్వారా తెలిసినట్లు సమాచారం. వీరు ద్విచక్ర వాహనాల ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా జిల్లాలోని గంగారం, కొత్తగూడ, బయ్యారం, గూడూరు ఏజెన్సీ ప్రాంతాల నుంచి జిల్లాలోని రైల్వే స్టేషన్లు ఉన్న ప్రాంతాలకు చేరుకుంటున్నారు.

రైల్వేస్టేషన్లు ఉన్న ప్రాంతాల నుంచి..

ఇతర రాష్ట్రాల నుంచి అటవీ మార్గాల ద్వారా గంజాయి జిల్లాలోని రైల్వే స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లోకి రవాణా చేస్తున్నారు. ప్రధానంగా గంగారం, కొత్తగూడ అటవీ మార్గం నుంచి బయ్యారం మీదుగా మహబూబాబాద్ పట్టణం లేదా, గార్ల మండల కేంద్రానికి గోప్యంగా చేరవేస్తున్నట్లు సమాచారం. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నుంచి గార్ల, డోర్నకల్‌కు వస్తారు. దీంతో పాటు గంగారం, కొత్తగూడ మండలాల నుంచి వరంగల్ జిల్లా నెక్కొండ, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ప్రాంతాలకు చేరుకుంటారు. అక్కడ గంజాయి చేతులు మారుతూ రైళ్ల ద్వారా హైదరాబాద్, మహారాష్ట్రకు ఎవరికి అనుమానం రాకుండా మహిళల ద్వారా గంజాయిని గమ్య స్థలాలకు చేరవేస్తున్నట్లు సమాచారం. కాగా గంజాయి సరఫరాదారులు సాధారణ ప్రయాణికులతో కలిసిపోతున్నారు. లగేజి బ్యాగుల్లో ప్యాకింగ్ చేసి, గంజాయి వాసన రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గోప్యంగా తరలిస్తున్నారు.

యువకులే టార్గెట్

మహారాష్ట్ర, హైదరాబాద్, వరంగల్ లాంటి పట్టణాలకు గంజాయి సరఫరాకు మహబూబాబాద్ జిల్లా కేంద్ర బిందువు ఒక భాగమైతే, ఇక్కడి యువత ఆ మహమ్మారికి అలవాటు పడుతూ మత్తులో తూగుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, కేసముద్రం, డోర్నకల్, నర్సింహులపేట, మరిపెడ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. గంజాయి సిగరెట్లతో పాటు కొన్ని చోట్ల ఎడిషన్ మొదలైన సిగరెట్లు తీసుకొని అందులోని పొగాకును తీసివేసి గంజాయి ఆకును నింపి తాగుతూ మత్తులో తూగుతున్నారు. సాయంత్రం కాగానే నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి గంజాయి నింపిన సిగరెట్లు తాగి మైకంలో ఊగుతున్నారు. దీంతో జిల్లాలోని మండల కేంద్రాలే కాకుండా పలు మారుమూల ప్రాంతాల్లో నూ యువత గంజాయికి బానిసలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి రవాణా, సరఫరా, వినియోగాన్ని అరికట్టి యువతను కాపాడాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

2025లో నమోదైన కేసులు..	
నమోదైన కేసులు	23
పట్టుబడిన గంజాయి	256.199
లిక్విడ్ గాంజా	274 లీటర్లు
పట్టుకున్న గంజాయి విలువ	రూ. 1.24 కోట్లు
సీజ్ చేసిన వాహనాలు	10
విచారించిన వ్యక్తులు	73
అరెస్టయిన వారి సంఖ్య	62



గంజాయి రవాణాపై నిఘా పెంచాం..

- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

జిల్లావ్యాప్తంగా గంజాయి నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. బస్సు, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో గస్తీ పెంచాం. ఈ మధ్య యువత గంజాయి సేవిస్తున్న కేసులు నమోదవుతున్నాయి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

కలెక్టర్ గారూ.. అధికారులను అప్రమత్తం చేయండి

- భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి : కలెక్టర్‌కు ఫోన్‌లో మంత్రి సీతక్క ఆదేశం



కొత్తగూడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : 'కలెక్టర్ గారూ.. జిల్లాలోని అధికారులను అప్రమత్తం చేయండి.. భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి.. ప్రతి మండలానికి ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీ వేయాలి' అంటూ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మంత్రి సీతక్క ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా సీతక్క కలెక్టర్‌తో మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లాలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు వాగులు దాటకుండా, చేపల వేటకు వెళ్లకుండా అవగాహన కలిగించాలన్నారు. వాగుల వద్ద పోలీస్ చెక్‌పోస్ట్ పెట్టి సెంట్రీ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా, వాటర్ పైపులు పగలకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రమాదాలు జరకగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన సాంకేతికతకు ఏఐ దోహదం

- డీఈవో రవీందర్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో టీచర్లకు శిక్షణ


టీచర్ల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సాంకేతికతను పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) దోహదపడుతుందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఏకశిలా ఏంజిల్స్‌హైస్కూల్‌లో సోమవారం సాంకేతిక అక్షరాస్యత, ఏఐపై 120 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అందిస్తున్న నూతన పద్ధతులను సమర్థవంతంగా విద్యార్థులకు అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. డీఎస్వో అప్పారావు మాట్లాడుతూ.. ఈ నెలలో నిర్వహించనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఈ శిక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, ఏఎస్సీ సంతోష్, డీఆర్పీలు సంపత్, అశోక్‌కుమార్, జగన్, యాదగిరి, విక్టోరియా పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి

అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ

8

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

వీసీలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. హైదరాబాద్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్, సంచాలకులు గోపీతో కలిసి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ప్రకారం యూరియాను సరఫరా చేయక పోవడం వల్ల ప్రస్తుతం రాష్ట్రంలో 2.98 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిందన్నారు. రైతులకు సరిపడా యూరియాను అందించలేక పోతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న లోటును దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత నిల్వలపై పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాస్థాయిలో సమన్వయం చేసుకుని మండలాల వారీగా అవసరానికి అనుగుణంగా కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేసి గందరగోళం లేకుండా యూరియాను సరఫరా చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ, జిల్లా అధికారులు విజయనిర్మల, వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, మురళీ, విజయచంద్ర పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- రెండు గంటల పాటు ఉద్రిక్తత
- జాతీయ రహదారిపై రాస్తారోకో
- రాకపోకలకు అంతరాయం
- పోలీసులతో రైతుల వాగ్వాదం


గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం 365జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వందలాది మంది రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగడంతో నర్సంపేట-మహబూబాబాద్ జాతీయ రహదారికి ఇరువైపు భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రెండు గంటల పాటు రైతులు రాస్తారోకో నిర్వహించడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డుపై బైఠాయించిన రైతులు కలెక్టర్ తమ వద్దకు రావాలని, యూరియా బస్తాలను వెంటనే ఇవ్వాలని, కేంద్ర, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఏవో అబ్దుల్‌మాలిక్ రైతులు రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినకపోవడంతో సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది బలవంతంగా రైతులను అక్కడి నుంచి పంపించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. గూడూరు సొసైటీకి రెండు రోజుల క్రితం 390 మంది రైతులకు 390 బస్తాల యూరియా అందించేందుకు టోకెన్లను ఇచ్చారు. సోమవారం ఉదయం యూరియా వస్తుందని ప్రచారం జరగడంతో తెల్లవారుజాము నుంచే రైతులు భారీ సంఖ్యలో సొసైటీ వద్దకు చేరుకున్నారు. ఎంత సేపటికి యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు గూడూరు జాతీయ రహదారికి చేరుకుని (మిగతా 8లో..)


నెల్లికుదురులో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

నెల్లికుదురులో..

నెల్లికుదురు (ఆంధ్రజ్యోతి): యూరియా అందడంలేదని మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. నెల్లికుదురు ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. వరి నాట్లకు యూరియా కోసం రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. యూరియా దొరకక పోవడంతో రైతులు వెళ్లిపోయారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యూరియాను వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణకు పంపిణీ చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం
- పార్లమెంట్ ఎదుట ఆందోళనలో ఎంపీ బలరాంనాయక్


పార్లమెంట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 3.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే విడుదల చేయాలని మానుకోట ఎంపీ బలరాంనాయక్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో పార్లమెంటు ఎదుట సోమవారం తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. తెలంగాణకు యూరియాను పంపిణీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్వయంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి విన్నవించినా యూరియాను అందించలేదని విమర్శించారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల సమస్యలపై కాంగ్రెస్ ఎల్లవేళలా రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి యూరియాను అందించాలని విజ్ఞప్తి చేశారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్


సేవాగ్రామ్ గాంధీ ఆశ్రమంలో యోగా చేస్తున్న రాంచంద్రునాయక్

మరిపెడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం ఏర్పడుతుందని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆయన రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి రెండు రోజులుగా మహారాష్ట్రలోని వార్ధా జిల్లా సేవాగ్రామ్ గాంధీ ఆశ్రమానికి రాజకీయ తాత్వికత శిక్షణలో భాగంగా పాల్గొని మాట్లాడారు. గాంధీ ఆశ్రమం ఒక సత్యశోధన స్థలమని, మహాత్మాగాంధీ ఆచరించిన సత్యం, అహింస, శ్రమదానం ఆచరణీయమన్నారు. రాంచంద్రునాయక్ వెంట ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్రానికి చెందిన ఇతర కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

జిల్లాను అలుముకున్న ముసురు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ముసురు అలుముకుంది. కొత్తగూడ, గూడూరు, చిన్నగూడూరు, కేసముద్రం, మరిపెడ, నర్సింహులపేట, పెద్దవంగర, బయ్యారం ముసురు అలుముకోగా, డోర్నకల్, గార్ల, కురవి, మహబూబాబాద్‌లలో చిన్నపాటి జల్లులు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి ముసురు అలుముకోవడంతో జనజీవనం స్తంభించింది. జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 95.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. సగటున 6.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 5.2, గంగారంలో 6.4, బయ్యారంలో 2.6, గార్లలో 5.8, డోర్నకల్‌లో 4.2, కురవి 5.4, మహబూబాబాద్‌లో 5.8, కేసముద్రంలో 7.4, నెల్లికుదురులో 6.8, నర్సింహులపేట 6.2, చిన్నగూడూరులో 2.8, మరిపెడలో 10.6, దంతాలపల్లిలో 8.6, తొర్రూరులో 5.2, పెద్దవంగరలో 12.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

రోగులకు ఇబ్బందులు కలిగించొద్దు

- సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్కారు ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సోమవారం తనిఖీ చేశారు. వార్డుల్లో రోగులతో మాట్లాడారు. వారికందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించాలని సూచించారు. సిజేరియన్ కాకుండా సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్యులు అవగాహన కల్పించాలన్నారు.

బీఎన్ గుప్తా తులరాం ప్రాజెక్టు జిల్లాకు తలమానికం

బీఎన్.గుప్తా తులరాం ప్రాజెక్టు జిల్లాకు తలమానికమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని బయ్యారం మండలం పరిధిలో ఉన్న తులరాం ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని, జిల్లాలోని తులరాం ప్రాజెక్టు అభివృద్ధిని మరిచారని ఆరోపించారు. తులరాం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే మానుకోట, ఇల్లందు నియోజకవర్గాల ప్రజల తాగునీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మదన్‌గోపాల్‌లోయా, బండారు వెంకన్న, పోతురాజు రాజు, పద్మం ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ఆస్పత్రిలో శిశువును ఎత్తుకుని వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

శిశువుకు సీఎం రేవంత్ పేరు..

మహబూబాబాద్ మండలం కొమ్ముగూడెంకు చెందిన మహిళా నవ్య పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా ఆ బిడ్డకు పేదల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు పెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మదన్‌లోయా, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ హరిసింగ్, శంతన్‌రామారాజు పాల్గొన్నారు.



మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

• సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

• కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్ల ధర్నా

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించి ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వర్షంలో తడుస్తూ అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రీ ప్రైమీరీ, పీఎంశ్రీ విద్య ఇంగ్లిష్ మీడియం విద్య పేరుతో 5 సంవత్సరాలలోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడే పరిస్థితి నెలకొందని, ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ, స్నేహబిందు, కుమ్మరికుంట్ల నాగన్న, వాసం దుర్గారావు, సులోచన, సంధ్య, నీల, లలిత, సరోజ, విజయ, పద్మ, సుజాత, యాకాంబ్రం పాల్గొన్నారు.

ఏడుబావుల జలపాతం సందర్శన నిషేధం

గంగారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంత ఆహ్లాదంగా ఉంటుందో అంత కంటే ప్రమాదంగా మారిన ఏడుబావుల జలపాతం సందర్శనను గూడూరు సీఐ సూర్యప్రకాష్ సోమవారం నిషేధం ప్రకటించారు. గంగారం అటవీ రేంజ్ అధికారులతో చర్చించి ఏడు బావుల జలపాతం వద్దకు ఎవరిని వెళ్లనీయకుండా రెండు శాఖల అధికారులు కాపలా కాస్తున్నారు. ఈ జలపాతం వద్ద ఒకరు మృతి చెందారని తెల్సినా.. పర్యాటకులు జలపాతం అందాలను తిలకించేందుకు ఇతర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లపై వస్తూనే ఉన్నారు. వారందరిని పోలీసులు జలపాతం వద్దకు వెళ్లనీయకుండా ఆపివేస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి అరెస్టు

వివాహితతో వివాహేతర సంబంధంతో ఆమె భర్త ఆత్మహత్య

వాజేడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నలుగురికి మంచి చెప్పాల్సిన ఉపాధ్యాయుడు పక్క దారి పట్టి కటకటాలపాలయ్యాడు. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు ఓ వివాహితతో సంబంధం పెట్టుకొని ఆమె భర్త మరణానికి కారణమయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడగా సదరు ఉపాధ్యాయుడు జైలుకు వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వాంకోడుతు బావుసింగ్‌ది భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలోని సూర్యతండా. కొన్ని సంవత్సరాలుగా మండలంలోని బిజినేపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు చెందిన ఓ వివాహిత పరిచయం కాగా ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.

ఈ విషయం సదరు మహిళ భర్తకు తెలిసి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్న కొత్తగుడెం పోలీసులు ఆత్మహత్యకు కారణమైన బావుసింగ్‌ను ఈ నెల 11వ తేదీన పాఠశాలకు వెళుతున్న సమయంలో వెంకటాపురంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో సదరు మహిళ సైతం అరెస్టు అయినట్లు సమాచారం. బావ్ సింగ్‌కు వివాహం జరగగా పెళ్లైన కొన్ని నెలలకే అతడి ప్రవర్తన నచ్చక భార్య విడిగా ఉంటోంది. ఆమె కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. ఇదిలావుండగా, బావ్‌సింగ్ అరెస్టు అయిన సంఘటనను విద్యాశాఖ అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జైలుకు వెళ్లిన బావ్‌సింగ్‌పై ఇంత వరకు శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

నిలకడగా గోదావరి ప్రవాహం

కాళేశ్వరం, రామన్నగూడెం పుష్కరఘాట్ల వద్ద పెరుగుతూ, తగ్గుతున్న వైనం

సమ్మక్క సాగర్‌లోకి కొనసాగుతున్న వరద ప్రవాహం

కన్నాయిగూడెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. వరుస వర్షాలతో ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతుండడంతో గోదావరి ఉరకలు వేస్తూ ప్రవహిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి సోమవారం ఉదయానికి తగ్గుముఖం పట్టింది. బ్యారేజీలోకి వచ్చే ఇన్ ఫ్లో ఆదివారం అర్ధరాత్రి 5,60,280 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదు కాగా సోమవారం ఉదయం 9 గంటలకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టి 5,34,160 క్యూసెక్కుల ఇన్ ఫ్లో గా నమోదు అయ్యింది. మధ్యాహ్నం 3 గంటలకు మరింత తగ్గుముఖం పట్టి 5,07,610 క్యూసెక్కుల ఇన్ ఫ్లోగా నమోదు అయింది. సాయంత్రం 6 గంటలకు మరింత తగ్గు ముఖం పట్టి 4,98,280 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదు అయింది. వరద ప్రభావం కొనసాగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 59 గేట్లు ఎత్తి బ్యారేజీని ఫ్రీ ఫ్లో గా ఉంచారు. బ్యారేజీ వద్ద 79.80 మీర్ల నీటి మట్టం నమోదయింది.

● మహదేవపూర్/ ఏటూరునాగారం రూరల్: మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సోమవారం గోదావరి నిలకడగా ప్రవహించింది. ఎగువన మహారాష్ట్ర నుంచి ప్రాణహిత పరవళ్లు తొక్కుతుండగా, తెలంగాణలో గోదావరి వరద రెండు కలిసి నదులు త్రివేణి సంగమం వద్ద నిలకడగా ప్రవహిస్తున్నాయి. సోమవారం 8.9 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవాహం ఉంది.

ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి సోమవారం సాయంత్రం వరకు పెరిగిన గోదావరి ఆ తర్వాత క్రమంగా తగ్గు ముఖం పట్టింది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి ఉదయం 11గంటలకు 13.490 మీటర్లకు చేరి పెరిగిన గోదావరి ఆ తర్వాత క్రమంగా తగ్గు ముఖం పట్టింది. సాయంత్రం 5గంటలకు 13.450 మీటర్ల వద్ద గోదావరి నిలకడగా కొనసాగుతోంది.



కన్నాయిగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 4.29లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.5మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

డే-కేర్, క్రెచ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

రాష్ట్రంలో మొదటిసారి జిల్లాలోని జగ్గన్నపేటలో క్రెచ్ కేంద్రం ఏర్పాటు

తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి - మంత్రి సీతక్క

ములుగు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో 25 డే-కేర్, క్రెచ్ కేంద్రాల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రంలో మొదటిసారిగా జిల్లాలోని జగ్గన్నపేటలో క్రెచ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, క్రెచ్ కేంద్రాలు పిల్లల సంరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం ములుగు మండలంలోని జగ్గన్నపేటలో ఆమె అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి డే-కేర్ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.15లక్షల నిధులతో చేపట్టనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సరైన క్రెచ్ కేంద్రాలు లేకపోవడంతో తరచుగా మహిళలు బయటకు వెళ్లి పని చేయడానికి ఇబ్బందిగా మారిపోయిందని, తమ పిల్లలకు సరైన సంరక్షణ, రక్షణ కల్పించడంలో పనిచేసే తల్లులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను పరిష్కరించడానికి పల్నా పథకం ద్వారా డే-కేర్, క్రెచ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

ఏడునెలల నుంచి మూడేళ్ల వయసు గల పిల్లలకు సురక్షితమైన వాతావరణంలో నాణ్యమైన క్రెచ్ సౌకర్యాలను అందించబడతాయని అన్నారు. పోషకాహారం, పిల్లల ఆరోగ్యం, పెరుగుదల, పర్యవేక్షణ వంటి సేవలు డే-కేర్, క్రెచ్ కేంద్రాలు అందిస్తాయని అన్నారు. జిల్లాలోని ములుగు, తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురంలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పల్నా పథకం ద్వారా 25 డే-కేర్, క్రెచ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ములుగు మండలంలోని ఇంచెర్ల గ్రామంలో రూ.37కోట్లతో నిర్మించనున్న ఎకో ఎత్నిక్ విలేజ్ డెవలప్‌మెంట్ వర్క్స్ ఫౌండేషన్ స్టోన్‌కు ఆమె రాష్ట్ర పర్యాటక అభివృద్ధిసంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ వినోద్, ములుగు ఆర్డీవో వెంకటేష్, జిల్లా సంక్షేమ అధికారి టి.రవి, తెలంగాణ స్టేట్ లీడర్ మొబైల్ క్రెచ్ మాణికప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ మొబైల్ క్రెచ్ రాంప్రసాద్, సీడీపీవో కె.శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జగ్గన్నపేటలో క్రెచ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

జనగామ కల్చరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు జనగామలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 16న ఇంటర్నేషనల్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.గౌతమ్ (8వ తరగతి), కె.శశాంక్ (9వ తరగతి) రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జె.లచ్చిరాం సోమవారం తెలిపారు. 19, 20 తేదీల్లో హైద్రాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొంటారన్నారు.

● లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన జడ్పీహైస్కూల్ విద్యార్థి ప్యాట దుర్గాప్రసాద్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మల్లికార్జున్ తెలిపారు. 16న జిల్లా కేంద్రంలో జరిగిన అండర్ -15 వాలీబాల్ పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. దుర్గాప్రసాద్‌ను హెచ్‌ఎం మల్లికార్జున్, ఫిజికల్ డైరెక్టర్ కిష్టయ్య అభినందించారు.

శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● మునిసిపల్ ఆఫీస్ ఎదుట సీపీఐ ఆందోళన

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ శివారు ఇల్లందు రోడ్‌లోని హిందూ, ఆర్యవైశ్య శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ... మునిసిపల్ 17,18 వార్డుల పరిధిలోని శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్మశానవాటికల్లో నేటికి విద్యుత్ సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. స్నానాల గదులు నిర్మాణాలు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో చిదిరాల జ్ఞానేశ్వర్, వెలుగు శ్రావణ్, అశోక్, ప్రవీణ్, చిరంజీవి, అనిల్, రాజు, ఉపేంద్ర, వేణు, వెంకటలక్ష్మి, పద్మ, దుర్గాప్రసాద్, శ్రీను, రామ్మూర్తి, రవి పాల్గొన్నారు.



కోర్టు వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

• భూపోరాట కేసులను ఎత్తివేయాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిలువ నీడలేని అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. భూపోరాట కేసులో మానుకోట జిల్లా కోర్టుకు సోమవారం సీపీఎం నాయకులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, పిట్టల శైలజ, వెంకటమ్మ, మాధవి, సునిత, రజిని, పద్మ, వీరభద్రం, కృష్ణ తదితరులు మొత్తం 41 మంది సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. పట్టణంలో అనేక మంది ఇళ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ఇంటి స్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుపేదల ఇంటి స్థలాల కోసం పోరాడిన సీపీఎం నాయకులపై కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు దక్కేంత వరకు తమ పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు.



ఆనకట్ట కుడికాలువ తెగి వృథాగా పోతున్న నీరు

ప్రకృతి ప్రకోపం.. పాలకుల నిర్లక్ష్యం

చిన్నగూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి ప్రకోపానికి పాలకుల నిర్లక్ష్యం తోడైంది. ఫలితంగా ఆకేరు సమీప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉగ్గంపల్లి, చిన్నగూడూరు గ్రామాల మధ్య ఆకేరువాగులో 61 ఏళ్ల కిందట ఆనకట్ట, కాలువలు నిర్మించారు. కాలానుగుణంగా మార్పులు చేయకపోవడంతో 2022లో చెక్‌డ్యామ్, 2023లో గంగమ్మ ఆలయం ధ్వంసం, గత ఏడాది ఆగస్టులో ఆనకట్ట కుడి కాలువకు గండి పడింది. పలు నిర్మాణాలు ధ్వంసమై సంవత్సరాలు దాటినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది వర్షాలకు వస్తున్న నీరు నిల్వలేక తెగిపోయిన కాలువ ద్వారా వృథాగా పోతుంది. పంట చేతికొచ్చే సమయానికి నీరు అందడం సంకటమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, విస్సంపల్లి, జయ్యారం, మన్నెగూడెం గ్రామాల్లో సుమారు 2800ఎకరాల్లో ఆకేరు ఆధారంగా వరి పంటసాగు చేస్తారు. పలు గ్రామాల రైతుల పంట సాగుకు జీవన ఆధారమైన ఆనకట్టకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికార, పాలకుల నిర్లక్ష్య ధోరణిపై ఆకేరు పరిసర ప్రాంత రైతులు మండిపడుతున్నారు.

వెన్నారం పెద్ద చెరువు కట్టకు బుంగ

డోర్నకల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నారం పెద్ద చెరువు కట్ట చిన్నతూము వద్ద బుంగ ఏర్పడింది. విషయాన్ని గుర్తించిన రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సోమవారం చెరువు కట్టను పరిశీలించిన అధికారులు బుంగపడ్డ ప్రాంతంలో జేసీబీతో పూడ్చి వేయించారు. ప్రస్తుతం చిన్నతూము ద్వారా నీటి సరఫరా ఈ ఏడాది నిలిపివేయాలని రైతులకు సూచించారు. పెద్దతూము ద్వారానే రైతులు సాగు నీటిని తరలించుకోవాలని చెప్పారు.



బుంగపడ్డ పెద్ద చెరువు కట్టను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో వచ్చే ఏడాది నుంచి అమలు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఘన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం పరిశీలించారు. పరిసరాలను, కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం కోసం వండిన వంటలను, వంట సామగ్రిని పరిశీలించారు. టెన్త్ క్లాస్‌లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థినులు వీక్‌గా ఉండడంతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, ఐరన్ ట్యాబ్‌లెట్స్ ఇస్తున్నారా, అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వార్డెన్, ఏఎన్‌ఎం ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాతో ఫోన్‌లో మాట్లాడి ఆశ్రమపాఠశాలలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, అందుకు మీ పరంగా అన్ని ప్రపోజల్స్ పంపిస్తే ప్రభుత్వంతో మాట్లాడి అప్‌గ్రేడ్ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీటీడీవో ప్రేమకళ, ప్రిన్సిపాల్ రాజు, సిబ్బంది శ్రీమతి, స్వర్ణలత, శిరీషా, మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, సీహెచ్ నరేందర్ రెడ్డి, బానోతు రాజేష్‌నాయక్, బూర్ల శంకర్, గన్ను నర్సింహులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

●ప్రమాణాలతో విద్యనందించాలి..

రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ వారు అత్యుత్తమ స్థాయికి ఎదగడానికి అంకితభావంతో పనిచేయాలని ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శ్రీహరి సూచించారు. ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్, పీఎంశ్రీ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా అప్ గ్రేడ్ కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భారత రవిందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, మాజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, బొల్లం అజయ్ మణికంఠ, ఎంఇవో రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏదేని సమస్యల నిమిత్తం బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 18 మంది బాధితులు వారివారి సమస్యలను ఎస్పీకి విన్నవించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసుఠాణా అధికారులతో ఎస్పీ మాట్లాడారు. చట్టం పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.



విప్లవ సంస్థలు ఐక్యంగా ఉద్యమించాలి

న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

బయ్యారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విప్లవ సంస్థలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్)- న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కేంద్ర కమిటీ సభ్యుడు అశోక్ అభిప్రాయపడ్డారు. సోమవారం బయ్యారంలో ఆ పార్టీ ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలోని ముఖ్య కార్యకర్తల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన అశోక్ మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడేందుకు విప్లవ సంస్థలు ఒక్క తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

చంద్రన్న వర్గానికి రాజీనామా

పార్టీలో చంద్రన్న అనుసరిస్తున్న పార్టీ వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్లు అశోక్ పేర్కొన్నారు. నిర్మాణ సూత్రాలు ఉల్లంఘిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపించారు. చంద్రన్నతో పార్టీ మనుగడే ప్రమాదకరంగా మారడంతో చంద్రన్న వర్గానికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఇక ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఏరియా కమిటీ సభ్యులు సీపీఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ గానే కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు. సదస్సులో నాయకులు ఊక్లా, మదార్, శ్రీనివాస్, కోటమ్మ, పాపారావు, వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, చిన లింగయ్య, నర్సిరెడ్డి, కవిత, బాలయ్య, రాంసింగ్, దేవేందర్, బుజ్జయ్య, నారాయణ, జ్యోతి, ప్రశాంతి, శ్రీదేవి, రామచంద్రు, గణేష్, రాజేష్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)


పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7660	5300
మక్కలు	2012	1521
కందులు	5839	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6200	3450
పల్లికాయ (పచ్చిది)	4900	1575
పసుపు (కాడి)	10555	9534
పసుపు (గోల)	10509	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	14000	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15200	11500
యూఎస్341ఏసీ	14000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం







శాశ్వత జ్ఞాపకం ఫొటో!

కాలంతో పాటు మారుతూ వస్తున్న ఫొటోగ్రఫి రంగం

సెల్‌ఫోన్‌లో బంధించే అవకాశం రావడంతో మరింత ప్రాచుర్యం

క్లిక్‌మనే శబ్దం లేని కార్యక్రమమే లేదిప్పుడు..

నేడు ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా మారిన అత్యాధునిక టెక్నాలజీతో సెల్ ఫోన్లలో సైతం ఫొటోలు తీసే అవకాశం రావడంతో ఫొటోగ్రఫి రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతీ వ్యక్తి ఫొటోగ్రాఫర్‌గా అవతారమెత్తి అద్భుతమైన ఫొటోలు తీస్తూ చెరిగిపోని జ్ఞాపకాలుగా మలుస్తున్నారు. ఒకప్పుడు పెద్ద నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఫొటోగ్రఫి.. క్రమంగా విస్తరించి గ్రామాలకూ అందుబాటులోకి వచ్చింది.

ఫొటోకు అంకురార్పణ

ప్రపంచ చరిత్రలో ఆగస్టు 19న మొట్టమొదటి ఫొటోకు అంకుర్పాణ జరిగింది. 1839లో ఫ్రాన్స్‌కు చెందిన దాగూరే అనే శాస్త్రవేత్త గాజుపలకపై కొన్ని రసాయనాలు పోసి దానిని ఛాయాచిత్రంగా రూపొందించాడు. అప్పటి నుంచి ప్రతీ ఏటా ఆగస్టు 19ని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆనాటి నుంచి ఫొటోగ్రఫి కాలనుగుణంగా అనేక రూపాంతరాలు చెందుతూ జర్మనీ, జపాన్ దేశాల అత్యాధునిక లేజర్ డిజిటల్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతూ ప్రపంచవ్యాప్తంగా సుస్థిరస్థానం సంపాదించుకుంది. అన్ని రకాల కార్యక్రమాల్లో, కార్యకలాపాల్లో తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

ఉమ్మడి జిల్లాలో ..

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 1940 నుంచి ఫొటో అందుబాటులోకి వచ్చినట్టు చరిత్ర చెబుతోంది. తొలినాళ్లలో వరంగల్ నుంచి ఔట్‌డోర్ ఫొటోగ్రాఫర్లుగా వేళ్లమీద లెక్కపెట్టే మంది మాత్రమే ఉండేవారు. వారిలో శంకరయ్య, ఇర్ఫాన్, రాంసింగ్, దుర్గాసింగ్, వరదరాజులు నాయుడు, కోదాటి లక్ష్మణ్, బిట్ల నారాయణ (రవి వర్మ), హరి బ్రదర్స్ (నీల్ కమల్), జయప్రకాష్ (ప్రకాష్ స్టూడియో) తదితరులు ఫొటోగ్రాఫర్లుగా చలామణి అయ్యేవారు. 1970 తర్వాత ఫొటోగ్రఫి రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వరంగల్, హనుమకొండ నగరాలతో పాటు జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, నర్సంపేట, తొర్రూరు, పరకాల, తదితర పట్టణ ప్రాంతాల్లోనూ ఆధునిక డిజిటల్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. నెగెటివ్‌లతో పనిలేకుండా ఫొటోగ్రఫి రంగం.. మొబైల్, చిప్‌లతో రాజ్యమేలుతూ ప్రత్యేకతను చాటుకుంటోంది.






ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

- ఫొటోగ్రఫిలో రాణిస్తున్న రాజేశ్వరి
- 20 ఏళ్లుగా ఫొటో స్టూడియో నడుపుతూ కుటుంబానికి ఆదరువు

కాటారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆమె కు చిన్ననాడే వివాహం అయింది.. భర్త తోడు గా సంసార బాధ్యతలు నిర్వహిస్తూ అన్యోన్యంగా సాగుతున్న వారి సంసారంలో పెను కుదుపు ఏర్పడింది. ఫొటోగ్రాఫర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్న భర్త.. విధి వక్రీకరించి మంచం పట్టడంతో కుటుంబం పోషణ భా రంగా మారింది. ఓ వైపు మంచాన పడ్డ భర్త, ముగ్గురు చిన్న పిల్లలను సాకే బరువు, బాధ్యత ఆమె నెత్తిన పడింది. అయినా కష్టాలకు వెరవకుండా.. కన్నీళ్లను దిగమింగి హా బీగా నేర్చుకున్న ఫొటోగ్రఫినే వృత్తిగా ఎంచుకుంది. కుటుంబ భారమంతా మీద వేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగు తూ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఆమే పస్తం రాజేశ్వరి. ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ఆమె జీవన పయనంపై ప్రత్యేక కథనం..



స్టూడియోలో ఫొటో తీస్తున్న రాజేశ్వరి

చిన్ననాటి నుంచే...

కాటారం మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన రాజేశ్వరికి 16ఏటనే పస్తం రాజేష్‌తో వివాహం జరిగింది. భర్త రాజేష్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రాజేష్ దంపతులకు ఉమేష్, రామకృష్ణ అనే ఇద్దరు కుమారులతో పాటు జ్యోతి అనే కుమార్తె ఉంది. జీవితం సాఫీగా సాగుతున్న క్రమంలో రాజేష్‌కు పక్షవాతం వచ్చింది. 15 ఏళ్లు మంచానికే పరిమితమై 5ఏళ్ల క్రితం తనువు చాలించాడు. అయినా బంధువుల సాయంతో మొక్కవోని ధైర్యంతో భర్త ద్వారా సరదాగా నేర్చుకున్న ఫొటోగ్రఫీనే వృత్తిగా స్వీకరించింది. ముగ్గురు పిల్లలతో కలిసి బతుకుపోరు మొదలు పెట్టింది.

సూటిపోటి మాటలు..

పురుషులే అధికంగా ఉండే ఫొటోగ్రఫి వృత్తిలోకి రాజేశ్వరి రావడంపై ఎంతోమంది సూటిపోటి మాటలు మాట్లాడినా లెక్కచేయకుండా రాజీలేని పోరాటంతో జీవనం సాగిస్తున్నది. ఫొటోస్టూడియోను ఆలంబనగా చేసుకొని బతుకు బండిని లాగుతోంది. గత 20ఏళ్లుగా ఫొటోస్టూడియోను విజయవంతంగా నడుపుతోంది. ఇన్‌డోర్, అవుట్ డోర్‌లోనూ అందమైన ఫొటోలు తీస్తూ రాణిస్తోంది. పెద్ద కుమారుడు ఉమేష్ ఎదిగి వచ్చి ఫొటోస్టూడియోలో పనిచేస్తుండగానే తీవ్ర అనారోగ్యం పాలై మంచం పట్టాడు. రెండో కుమారుడు రామకృష్ణ పీజీ చేయగా ఏదైనా ఉద్యోగం సాధించి కుటుంబానికి తోడుగా నిలుస్తాడని తలిస్తే.. పక్షవాతం బారిన పడ్డాడు. ఇలా కష్టాతో సహవాసం చేస్తూనే కుమార్తె జ్యోతికి బంధువుల సహకారంతో వివాహం జరిపించారు.

ఆదుకోవాలి...

బతుకు సమరంలో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తనకు ప్రభుత్వం సాయం అందించాలని రాజేశ్వరి కోరుతోంది. బంధువుల ఇంట్లో గత30ఏళ్లగా కిరాయికి ఉంటున్నామని, స్వంత ఇల్లు కూడా లేని తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని వేడుకుంటోంది. ఫొటోస్టూడియోతో పాటుముందు చిన్నగా ఫుట్‌వేర్ అమ్ముతున్నానని, తనకు సబ్సిడీ రుణం ఇచ్చి ఆదుకోవాలని కోరుతోంది.



దారి ఇలా.. బడికి ఎలా..?

స్వాతంత్ర్యం సిద్ధించి 79 వసంతాలు దాటినా.. సర్కార్ బడుల స్థితిగతులు మారడం లేదు. 'మా బడికి వెళ్లడానికి కనీసం బాట కూడా లేదు...' అని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని వీరారం శివారు మంచ్యాతండా ప్రైమరీ స్కూల్‌లో మొత్తం 22 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఆ పాఠశాలకు విద్యార్థులు, టీచర్ల రాకపోకలకు పొలాల గట్లే ఆధారం. వర్షాకాలంలో పొలాల గట్లు బురదమయం అవుతుండటంతో పలుమార్లు విద్యార్థులు జారిపడ్డ సంఘటనలున్నాయి. అంతేకాక పురుగులు, విష సర్పాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. దారి బాధ తప్పించడానికి కనీసం 10 ఫీట్ల రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, మరిపెడ రూరల్

ఇంతింతై వటుడింతై..

- ఖండాంతరాలకు విస్తరించిన కేయూ ఖ్యాతి
- వేలాది మంది జీవితాలకు దిక్సూచి
- 4 నుంచి 29 విభాగాల వరకు విస్తరణ
- నేడు స్వర్ణోత్సవంలోకి అడుగులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇంతింతై వటుడింతై అన్నట్లుగా కాకతీయ యూనివర్సిటీ విస్తరించింది. 1976లో ఏర్పడిన వర్సిటీ 2025 ఆగస్టు 19కి స్వర్ణత్సోవ సంబురాల్లోకి అడుగిడుతోంది. 50 ఏళ్ళ ప్రస్థానంలో అనేక మైలురాళ్ళను అధిగమించింది. ప్రపంచ వ్యాప్తంగా కేయూ విద్యార్థులు శాఖోపశాఖలుగా విస్తరించారు. ఆర్ట్స్, సోషల్, సైన్స్, బయోటెక్నాలజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, కెమిస్ట్రీ, కామర్స్ ఎడ్యుకేషన్, లా విభాగాల్లో వేలాదిమంది విద్యార్థులు పట్టాలు పొందారు. తొలుత 1968లో హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీకి అనుబంధంగా పీజీ సెంటర్‌గా ఏర్పడింది. చారిత్రక వరంగల్ నగర ప్రశస్త్యాన్ని గురించి కాకతీయ సామ్రాజ్యం పేరుతో కాకతీయ యూనివర్సిటీ విద్యారణ్యపురిగా నామకరణం చేశారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్, ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నేతృత్వంలో వర్సిటీకి శంకుస్థాపన చేశారు. మొదటగా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు సైన్స్ గ్రూపుల్లో కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లతో షురూ చేశారు. తర్వాత అనేక కోర్సులను ప్రవేశపెట్టారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ..

కేయూ స్వయం ప్రతిపత్తి కల్గిన సంస్థ. నిర్ణయాలు కేయూ పాలక మండలి నేతృత్వంలో జరుగుతాయి. వీసీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీ పాలక మండలిని నియమిస్తుంది. డీన్ సీడీసీ, డీన్ అకాడమిక్ ఆడిట్‌లు ఎప్పటికప్పుడూ వర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోంది. కేయూ యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీస్ విద్యార్థులకు జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌లతో పాటు, రూసా, ప్రణాళిక సంఘం నిధులను తెప్పించి వర్సిటీ అభివృద్ధికి తోడ్పడుతోంది. విద్యార్థులకు సహాయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, సీహెచ్‌సీ సెల్‌లను ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్, గాంధీయన్ స్టడీస్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్, ఫ్రీ లీగల్ ఎయిడ్, బ్యాంకు, పోస్టాఫీస్, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్, వేదన పేరుతో మహిళల రక్షణ చర్యలకు సెంటర్‌ను ఏర్పాటు చేశారు.





ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, కేయూ వీసీ

672 ఎకరాల విస్తీర్ణం..

కేయూకు మొత్తం 672 ఎకరాల భూమి ఉంది. ఇందులో కెనాల్ కాలువలు, ఆల్ ఇండియా రేడియో స్టేషన్, పోలీస్‌స్టేషన్, మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ హెడ్ ట్యాంకులకు కొంత భూమిని తీసుకున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు వర్సిటీ భూములను అక్రమించుకున్నారు.

అందిస్తున్న కోర్సులివే..

ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్, రాజనీతిశాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్రం, హ్యూమన్ రిసోర్స్ అండ్‌ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎకానమిక్స్, సోషియాలజీ, గణితం, స్టాట్స్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, సైకాలజీ, జర్నలిజం, బాటనీ, జువాలజీ, బయో టెక్నాలజీ. బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ, సెరికల్చర్, కంప్యూటర్ సైన్స్, జియాలజీతో పాటు ఇంజనీరింగ్, కామర్స్, లా, ఫార్మసీ, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రరీ సైన్స్ విభాగాలున్నాయి. వీటితో పాటు దూరవిద్యలో యోగ, డిప్లొమాతో పాటు అనేక సర్టిఫికెట్ కోర్సులున్నాయి.

హాస్టల్ సౌకర్యాలు..

ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఎడ్యుకేషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, లా కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు వర్సిటీ క్యాంపస్‌తో పాటు సుబేదారిలోని లా హాస్టల్‌లో వసతి కల్పిస్తున్నారు. దాదాపు 5వేలకు పైగా విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు.

ఆన్‌లైన్‌లో కోర్సులు ..

కాకతీయ యూనివర్సిటీలో అఫ్‌లైన్ కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులు, సర్టిఫికేట్ కోర్సులనుమూక్ ద్వారానేరుగా యూజీసీఅందిస్తోంది.

మొత్తం 29 విభాగాలు..

కాకతీయ యూనివర్సిటీలో ప్రస్తుతం 29 రెగ్యులర్ విభాగాలున్నాయి. మొదటి, రెండో ఏడాది కలిసి ఒక్కో విభాగంలో సరాసరిగా 100 మంది విద్యార్థులుంటారు. ఇవే కాకుండా ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ కోర్సులున్నాయి. పీజీ కోర్సుల్లో డిగ్రీ విద్యార్హతతో క్యాంపస్ సీట్లు సాధిస్తే.. ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సైన్స్ కోర్సుల్లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు. మార్కెట్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పించే అనేక కోర్సులను కేయూ అందిస్తోంది. ప్రైవేట్ వర్సిటీలకు దీటుగా సెలబస్‌ను రూపొందిస్తోంది. రీసెర్చ్‌లోనూ దీటుగా నిలుస్తోంది.

టీచర్ల కొరత... ఆర్థిక సమస్యలు..

కేయూలో టీచర్ల కొరత ఉంది. 409 మంది అధ్యాపకులకు గాను కేవలం 76 మందే శాశ్వత ప్రతిపాదికన పనిచేస్తున్నారు. మిగతావారంతా కాంట్రాక్టు, పార్ట్‌టైమ్, పేపర్‌వైజ్ పద్ధతుల్లో పనిచేస్తున్నారు. దీనికి తోడు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో లాగా బ్లాక్ గ్రాంట్‌ను విడుదల చేయడం లేదు. దీంతో ఆదాయం కోసం విద్యార్థుల పరీక్షల ఫీజులు, ఇతర సర్టిఫికేట్ ఫీజులను పెంచారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు పరీక్షల విభాగంతో పాటు దూరవిద్య కేంద్రం నిధులపై ఆధారపడాల్సి వస్తోంది.

పోటీకి తగిన కోర్సులు కరువు..

కేయూలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు లేవు. కేవలం క్యాంపస్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు మాత్రమే కొంతమేర ప్లేస్‌మెంట్లు లభిస్తున్నాయి. ఇతర కోర్సులకు అంత ఆదరణ లేదు.

అభివృద్ధికి ప్రణాళికలు..

ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ వీసీ

గోల్డన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని వర్సిటీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాం. నిధుల కోసం వేచిచూస్తున్నాం. స్వర్ణోత్సవాల వేళ కేయూలో తెలంగాణ సైన్స్ అకాడమీ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాం. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం చేస్తున్న కృషిలో పాలుపంచుకుంటున్నాం. వచ్చే ఏడాది వరకు స్వర్ణోత్సవ సంబురాల కార్యక్రమాలు నిర్వహిస్తాం.

ఆకట్టుకుంటున్న బేసిక్ రోబోలు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారీ

కేసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నీతి అయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు అమర్చిన బేసిక్ రోబోలు ఆకట్టుకుంటున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులు బోడ గణేష్, జర్పుల కల్యాణ్, బానోత్ పవన్ తమ గైడ్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు విజయచందర్ సహకారంతో బేసిక్ రోబోల విడి భాగాలను అమర్చి తయారు చేశారు. విద్యార్థులకు పాఠశాల దశలోనే ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, సెన్సార్లు, కృత్రిమ మేధ వంటి విషయాలపై ప్రాథమిక అవగాహన ఈ ల్యాబ్‌లలో కల్పిస్తామని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ ల్యాబ్‌లో రోబోటిక్స్‌లో పంపిణీ చేసిన విడిభాగాలను అమర్చి బేసిక్ రోబోలను విద్యార్థులు తయారు చేసి నడిపించారు. స్వయం చలితంగా బేసిక్ రోబోలు తిరుగుతున్న వీడియోలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి విద్యార్థులను పలువురు అభినందించారు.



కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన బేసిక్ రోబో నమూనాలు

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు

ప్రమాదపు అంచున తాత్కాలిక కట్ట

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లంద, కొత్తపల్లి, ల్యాబర్తి గ్రామాల్లో ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకేరు వాగులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో చెక్ డ్యాంల నుంచి మత్తడి పడి నీరు దిగువకు వెళిపోతోంది. ఇల్లంద గ్రామ శివారులో గతేడాది కోతకు గురైన చోట తాత్కాలిక కట్టను నిర్మించారు. శాశ్వత పనులు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్వయంగా వచ్చి చూసినప్పటికీ పనులకు మోక్షం కలుగలేదు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో వరద పెరిగితే మళ్లీ కట్ట తెగిపోయి భూములు కోతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



ఇల్లందలో గ్రామ శివారులోని ఆకేరు వాగు వద్ద ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక కట్ట

పాపపరిహారానికి దాన ధర్మాలు చేయాలి

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సంత్ రవిదాస్ ఆశ్రమం కాశీపీఠాధిపతి ఆచార్య భరత్ భూషన్‌దాస్ సోమవారం హనమకొండలోని వేయిస్తంభాలగుడిని సందర్శించారు. రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిపుచ్చుకోవడం అనేది ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి లౌకిక ప్రపంచానికి దిగుమతి అయిన పదం అన్నారు. దీనికి గొప్ప తాత్విక చరిత్ర ఉందన్నారు. ఈశ్వరుడి ధ్యానంతోనే ఖర్మరాహిత్యం జరుగుతుందని చెప్పారు. పాపపరిహారం జరగాలంటే దాన ధర్మాలు చేయాలన్నారు. ఉత్తరాది కన్నా దక్షిణాదిలోనే సంప్రదాయాల పట్టింపు ఎక్కువ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనిల్ కుమార్ ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. స్వామివారికి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఉత్తిష్టగణపతికి కుంకుమ విలేపనాభిషేకం, రుద్రేశ్వర స్వామివారికి పాశుపత ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం ఆలయంలో ప్రదోశకాల పూజ నిర్వహించారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న సంత్ రవిదాస్

యూరియా కోసం
రోడ్డెక్కిన రైతులు

(5వ పేజీ తరువాయి)



రాస్తారోకో ప్రదేశంలో కర్రతో హెచ్చరిస్తున్న మహిళా రైతు

రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోకు బీఆర్ఎస్ నాయకులు నూకల సురేందర్, కటార్‌సింగ్, వీరన్న, కుమార్, అశోక్‌లు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదని, వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తుందన్నారు. మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశామని, ఆ పంటలకు యూ రియా వేయాలనుకున్న అన్నదాతలకు యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంపై ఏవో అబ్దుల్ మాలిక్‌ను వివరణ కోరగా గూడూరు సొసైటీ, ఆగ్రోస్, ప్రైవేట్ దుకాణాలకు 1100 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. రైతులకు సరిపడా యూరియా తెప్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు చెప్పారు. యూరియా వాడకం తగ్గించి నానో యూరియాను వాడాలని సూచించారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి

రైతులు ఆందోళన చెందవద్దు : కలెక్టర్ అద్వైత్‌కుమార్

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, యూరియా అమ్మకాలు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జరపాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పీఏసీఎస్ సొసైటీలు, ఆగ్రోస్, వ్యవసాయ దుకాణాలు, ఇతర ప్రైవేట్ షాపుల ద్వారా యూరియా విక్రయించాలన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా యూరియాను తెప్పించుకోవడం కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యూరియాను పంపిణీ చేయాలన్నారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.... రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, అనిల్‌కుమార్, డీఏవో విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో సోమవారం తనిఖీ చేశారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని రోగులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విషజ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల వారీగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరం ఉన్న చోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

21న స్పాట్ కౌన్సెలింగ్

గిరిజన గురుకులంలో ప్రవేశాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో (ఏకలవ్య గురుకులాలు మినహా) ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 21న కొత్తగూడలోని బాలికల గిరిజన గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో-ఆర్డినేటర్ (ఆర్సీవో) రత్నకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 19 నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను వర్షాలు, వరదల కారణంగా 21కి వాయిదా వేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు తల్లిదండ్రులు గమనించాలని కోరారు. 5వ తరగతి నుంచి 9 వరకు ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

సీపీఎస్‌ను రద్దు చేసేంత వరకు పోరాడుతాం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి



కలెక్టరేట్ వద్ద పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసేంతవరకు పోరాడుతామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న చేపట్టనున్న ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చి హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాగర్లముడి శ్రీధర్, సంకా బద్రినారాయణ, గీత, హల్యానాయక్, వెంకట్‌రెడ్డి, సీతారాములు, రాంజీ, సుజాత, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేయనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎంఈవో బుధారపు శ్రీనివాస్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేశ్ కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, బాలరాజు, విద్యాసాగర్, నరసింహారావు, సింహాద్రి, జాటోతు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఆందోళనలు



మహబూబాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతకు నిరసిస్తూ మహబూబాబాద్ తహసీల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కావాలనే రాష్ట్రానికి యూరియా అందించకుండా కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం యూరియా అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా ఇవ్వకుంటే బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సందీప్, రవి, వీరన్న, చిరంజీవి, నాగార్జున, సతీష్, శ్యాంప్రసాద్, రమేష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

యూరియా కొరతను తీర్చాలి

నెహ్రూసెంటర్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో ఏర్పడిన యూరియా కొరతను తక్షణమే తీర్చాలని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కే రాంచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరారు.

రైతులకు యూరియా అందకుండా బీజేపీ కుట్ర

నెల్లికుదురు (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందకుండా బీజేపీ కుట్ర చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు 8.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉండగా కేవలం 5.3 లక్షల మెట్రిక్ టన్నులు మత్రమే ఇచ్చారన్నారు. రైతులకు మోదీ ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుగులోత్ బాలాజీనాయక్, పెరమాండ్ల గుట్టయ్య, భాస్కర్ నాయక్, మంగీలాల్, రావుల సతీష్, కొప్పు శ్రీను పాల్గొన్నారు.

తొర్రూరులో..

తొర్రూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఏసీఎస్ భవనం ఎదుట యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. పీఏసీఎస్ సోమవారం గంటల తరబడి వేచి ఉన్న రైతులు రెండు యూరియా బస్తాలతో పాటు ఒక నానో యూరియా ఇచ్చారు. దీంతో రైతులు సొసైటీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పోలీసుల బందోబస్తుతో యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకన్న, ఎల్లయ్య, లలిత, యాకు, ఉప్పలమ్మ, మహేందర్, ఉపేందర్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న సీతారాంనాయక్

రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం

- బీజేపీ నేత అజ్మీరా సీతారాంనాయక్

కురవి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ వైపు యువత చూస్తున్నారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షురాలు గుగులోత్ దేవిక, ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, జోగి దిలీప్, వీరన్న, శ్యామల శ్రీనివాస్, వీరబాబు, పద్మ, బానోత్ విజయ, తేజావత్ వెంకన్న, సంతోష్, బాలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మునిసిపల్ ఆఫీస్ ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ...వీధి కుక్కలను ప్రత్యేక కేంద్రానికి తరలించాలని కోరారు. వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్నపిల్లలు, వృద్ధులు వెళ్తుంటే వారిని భయ భ్రాంతులకు గురి చేస్తూ వారి వెంట పడి కరుస్తున్నాయని చెప్పారు. అదే విధంగా కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో పారిశుధ్యసమస్య రోజు రోజుకు తీవ్రతరం అవుతుందని ఆరోపించారు. వర్షా కాలంలో సైడ్ డ్రైనేజీ కాల్వల్లో చెత్తను తొలగించకపోవడంతో నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని వాపోయారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, రావుల రాజు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్‌లో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఉదయం 9 గంటల వరకు రైతులు భారీగా తరలివచ్చారు. ఈ నెల 16న సుమారు 700 మంది రైతులు తరలిరావడంతో 444 బస్తాల యూరియా ఉండగా రైతుల వద్ద నుంచి ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకొని వెనక్కి పంపించారు. సోమవారం పత్రాలు ఇచ్చిన రైతులకు ఒక్కొక్క యూరియ బస్తాను పంపిణీ చేశారు.

'ఆత్మీయ భరోసా' కోసం పోరాటం

తొర్రూరురూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీలు, కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అందించేందుకు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. సోమవారం తొర్రూరు మండలం పత్తేపురం, మాటేడు, పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి యాకయ్య, వెంకన్న, సత్తెయ్య, రాములు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగార్జున

కేసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లికి వెళ్లే రోడ్డు మార్గాన్ని మరమ్మతులు చేయించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీకి చెందిన లారీలతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని ఆరోపించారు. పాలకులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

ఇద్దరికి జాతీయస్థాయి అవార్డు

కురవి/మరిపెడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఎరబోయిన శంకర్‌కు ఫొటోగ్రఫీలో జాతీయస్థాయి అవార్డు లభించింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 186వ వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని విజయవాడలో నిర్వహించారు. శంకర్ తీసిన బ్లాక్ అండ్ వైట్ ఫొటోకు గోల్డ్ మెడల్‌తో పాటు రూ.5 వేల నగదు బహుమతిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అందించారు. కార్యక్రమంలో నూకసాని బాలాజీ, కొంపెల్లి సుందర్, గోకరాజు గంగరాజు పాల్గొన్నారు. అలాగే మరిపెడ మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ ఎస్కే ఫక్రుద్దీన్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ఫక్రుద్దీన్ అవార్డు గెలుచుకున్నారు. సోమవారం విజయవాడలో నిర్వాహకుల నుంచి అవార్డు స్వీకరించారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

మరిపెడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందని జిల్లా షీ టీమ్ ఎస్సై సునంద అన్నారు. సోమవారం ఆమె జిల్లా పోలీస్ కళా బృందంతో మండల కేంద్రంలోని గురుకులంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో 100కు ఫోన్ చేస్తే తక్షణ సహాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు, పోలీస్ కళాకారులు సతీశ్, తిరుపతి, పృథ్వీరాజ్, షీ టీమ్ సిబ్బంది అరుణ, పార్వతి, సౌభాగ్య, భరోసా లీగల్ అడ్వైజర్ సాహిత్య, పీసీ సుప్రజ, ప్రిన్సిపాల్ సోమోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజిలో ఇటీవల సుంకరబోయిన యాకన్న మృతి చెందాడు. శ్రీవివేకవర్ధిని హైస్కూల్ 2015-16 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం మిత్రుడి కుటుంబానికి రూ.12వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో తోట కార్తీక్, సురేష్, యశ్వంత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఝాన్సీరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరయ్యారు. రక్తదానం, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఝాన్సీరెడ్డి చూపుతున్న పట్టుదల ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, పెదగాని కళావతి, డాక్టర్ సోమేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మేకల కుమార్, అశోక్‌రెడ్డి, సధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగరలో..

పెద్దవంగర (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి పండ్లను పంపిణీతో పాటు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగు మురళి, గోపాల్, రవీందర్‌రెడ్డి, జాని, దేవేంద్ర, శ్రీనివాస్, వెంకన్న, హరికృష్ణ, సీతారామ్, లింగమూర్తి, రవి, ఉపేందర్, ఉప్పలయ్య, అంజయ్య, వేణు, నరేష్, సతీష్, సంతోష్, రజినీకాంత్, రామ్‌చరణ్, వినోద్, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడులను ఖండించాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మీ-సేవ కేంద్రాలపై జరుగుతున్న దాడులను ఖండించాలని ఆ కేంద్రాల నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేశబోయిన అనిల్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో మీ-సేవ నిర్వాహకులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీ-సేవ కేంద్రంలో కమిషనర్‌గా పని చేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారిపై ఈ నెల 12న కొంత మంది వ్యక్తులు దాడి చేశారని వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, శ్రీనివాసచారి, జానీ, అనిల్, నాగేంద్ర, అరుణ్, జనార్దన్, పణి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

కేసముద్రం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి చైతన్యనగర్ కాలనీలో వారం రోజులుగా తాగునీరు రావడం లేదని సోమవారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు మాట్లాడుతూ నీళ్లు రావడంలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమ్ము రమాదేవి, వల్లందాసు మౌనిక, కళమ్మ, దివ్య, పద్మ, ఎల్లమ్మ, అమృత, సంగీత పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న చైతన్యనగర్ కాలనీ వాసులు

సర్వాయి పాపన్న ఆశయాలను ముందుకు తీసుకుపోవాలి

» అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో

» జిల్లావ్యాప్తంగా సర్దార్ జయంతి వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పాపన్న ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం పాపన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహస్వామి, గౌడ సంఘాల ప్రతినిధులు బిక్షి, వెంకటేశ్వర్లు, ముత్యం వెంకన్న, గౌని వెంకన్న, యమగాని వెంకన్న, చిత్తనూరి శ్రీనివాస్, బెల్లం కొండ శ్రీనివాస్, గునిగంటి మోహన్, ముంజాల రాజేందర్, నక్క నాగార్జున, తండా సందీప్, పెద్ది వెంకన్న పాల్గొన్నారు.

● మహబూబాబాద్‌లోని కురవి గేట్ వద్ద సర్వాయి పాపన్న విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం పాటు పడాలని చెప్పారు. కార్యక్రమంలో జే వెంకన్న, బండారు వెంకన్న, బెల్లంకొండ శ్రీనివాస్, ముత్యం వెంకన్న, వంగ వెంకటరమణ, యమగాని వెంకన్న, గౌని వెంకన్న, పోతురాజు రాజు, శంతన్‌రామరాజు, పోతురాజు రాజు పాల్గొన్నారు.

● పెరుమాండ్ల జగన్నాథం భవనంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యమగాని వెంకన్న, గౌని వెంకన్న,గునిగంటి మోహన్, యాకన్న, రామన్న, రాజు, విక్రమ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, గౌడ సంఘాల ప్రతినిధులు

● బీజేపీ జిల్లా కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, చీకటి మహేష్‌గౌడ్, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, గడ్డం అశోక్, జీ మదన్, చెల్పూరి వెంకన్న, నర్సింహారెడ్డి, పద్మావతి, గుగులోతు దేవిక , సతీష్, దారా ఇందుభారతి, పల్లె సందీప్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

చిన్నగూడూరు మండలం జయ్యారం, గుండంరాజుపల్లిలో సర్దార్ సర్వాయిపాపన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గౌడ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గునిగంటి మోహన్, గునిగంటి మహేష్, సాయి పాల్గొన్నారు.

● మరిపెడ మండలం గుండెపుడిలో పాపన్న విగ్రహానికి మరిపెడ మండల గౌడ యువజన సంఘం అధ్యక్షుడు గుండగాని రంగనాథ్‌గౌడ్, బోడపట్ల సుధాకర్‌గౌడ్, పులుసు చిరంజీవిగౌడ్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు.

● తొర్రూరులో పాపన్న విగ్రహానికి గౌడ సంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపల్లి రమేష్, దీకొండ శ్రీను, మేరుగు మల్లేశం, చీకటి శ్రీను, డి.శ్రీనివాస్, బిక్షం, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు. వెంకటాపురంలో గోపా ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ శీలం లింగన్న, శోభన్‌బాబు పాల్గొన్నారు.

● గార్ల నెహ్రూ సెంటర్‌లో పాపన్న చిత్రపటానికి మాజీ జడ్పీటీసీ ఝాన్సీలక్ష్మి, తాళ్లపల్లి కృష్ణగౌడ్, భూక్య నాగేశ్వర్‌రావు, యాకూబ్‌పాషా, కందునూరి శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

● బయ్యారంలో పాపన్న విగ్రహానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సత్యం, రాజన్న, వీరన్న, వెంకటేశ్వర్లు, రాంమ్మూర్తి, వినయ్, శ్రీను, నాగరాజు, పరమేష్, యాకయ్య పాల్గొన్నారు.

● పెద్దవంగర మండల కేంద్రంలో సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళీగౌడ్, సతీష్‌గౌడ్, వినోద్, శ్రీనివాస్, గోపాల్, రమేష్, హరికృష్ణగౌడ్, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కేసముద్రం విలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.